సంపద సృష్టి జరిగేనా?

- బాల్కొండ ఉమ్మడి మండలంలో పిచ్చి మొక్కల్లో సంపద వనాలు
- పట్టించుకోని అధికారులు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు


పోచంపాడ్‌లోని సంపద వనం


పోచంపాడ్‌లోని సంపదవనంలో పెరిగిన కలుపు మొక్కలు

బాల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలానికొక సంపద వనాలను ఏర్పాటు చేశారు. మెండోరా మండలంలో పోచంపాడ్, బాల్కొండ మండలంలో బస్సాపూర్ శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో వీటిని రూ.10లక్షలతో ఏర్పాటు చేశారు. వనాల్లో ప్రధానంగా జామ, అల్లనేరడి, మామిడి లాంటి మొక్కలను నాటారు. సంరక్షణను కొన్నాళ్లు మరిచి... మళ్లీ ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా నిర్వహణ చేపట్టారు. రెండేళ్లు గడుస్తున్న ఇప్పటికీ సంపదవనంలో ఫలాలు లేవు. వనాల్లో మొత్తం కలుపు మొక్కలు పేరుకు పోయాయి. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆనుకుని వనం ఏర్పాటు చేసిన కొన్నాళ్లు నీటి కొరత ఏర్పడింది. బోరుకు మోటర్ బిగించకపోవడంతో సమస్య తలెత్తింది. చివరికి బోరుకు మోటర్ బిగించారు. పోచంపాడ్‌లో కాకతీయ కాలువ దిగువన ఏర్పాటు చేశారు. చౌడు నేలల్లో మొక్కలు ఏపుగా పెరగడం లేదు. నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి ఫలాలను ఎప్పుడు ఇస్తాయో అధికారులకే తెలియాలి. నాటిన మొక్కల మధ్య ఏపుగా పెరుగుతున్న పిచ్చి మొక్కలను కూడా తొలగించడం లేదు. సంపద వనాలను ఎవరు పర్యవేక్షించాలో ఇప్పటికీ స్పష్టత లేదు. ఏ గ్రామంలో ఏర్పాటు చేశారో ఆ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ జరగాలని ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. జీపీ అధికారులు తమకు ఎలాంటి నిధులు కేటాయించ లేదని చేతులు ఎత్తివేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కలుపు తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఎరువులు వేసి మొక్కలను పెంచుటకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సంపద వనల్లో కలుపు తొలగించుటకు, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. వరదలు ఎక్కువగా రావడంతో కొంత మేర ఇబ్బందులున్నాయి. సంపద వనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాం.

– కొండ లక్ష్మణ్, ఎంపీడీవో, మెండోరా

క్లుప్తంగా

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. డీఐఈవో రవికుమార్, ప్రిన్సిపాల్ రజియొద్దీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ సమావేశం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం చైర్మన్ పాలెపు నర్సయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మూడు నెలల ఆదాయ, వ్యయాలను సూపర్‌వైజర్ రాజు చదివి వినిపించారు. మార్కెట్ యార్డు ఆవరణలో చేపట్టాల్సిన పనులపై పాలకవర్గం సభ్యులు చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు గాను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాల్సిన పరికరాల అవసరంపై చర్చించారు. వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌లో ఎట్టం సాయన్న అనే బాధితునికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. బాధితుడికి రూ.20 వేల చెక్కు అందించినట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు లింబారెడ్డి, అనిల్, ప్రదీప్, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులున్నారు.

సొసైటీ కార్యదర్శికి వీడ్కోలు



వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ సొసైటీ కార్యదర్శి స్వామి పదవీవిరమణ పొందడంతో శుక్రవారం ఆయనకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. సొసైటీలో సిబ్బందిగా, కార్యదర్శిగా రెండు దశాబ్దాలకు పైగా రైతులకు సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్లు జి.నర్సారెడ్డి, టి.శేఖర్, నాగ మల్లేష్, టక్కర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ గడ్డం రాజన్న కుమారుడు ఎన్నారై రమేష్ రెడ్డి శుక్రవారం క్రీడా దుస్తులను అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రమేష్ రెడ్డి తల్లి లక్ష్మీ సుమారు 100 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన వెల్డర్ ప్రసాద్ దేశ నాయకుల చిత్ర పటాలను పాఠశాలకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, గడ్డం చిన్న రాజన్న, గంగా రెడ్డి, జంగం మురళి, వినోద్ రెడ్డి, రాజా రెడ్డి, రాజలింగం, నర్సా రెడ్డి, రత్న, ప్రతాప్, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ



బాల్కొండ: నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి చదువు నేర్పి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుట కోసం ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్‌పై శుక్రవారం మండల పరిధిలోని 11 గ్రామాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళ సమాఖ్య వీవోఏలకు, స్థానిక పాఠశాల హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతు.. ప్రతి గ్రామంలో మహిళ సమాఖ్య సంఘం పరిధిలో 30 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వీవోఏలు, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి


వేల్పూర్ ఎంపీడీవో ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వేల్పూర్: పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేల్పూర్ మండల పరిషత్తు కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పేర్కొంటూ అరకొర వేతనంతో పని చేసే తమకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, రెండు జతల దుస్తులు ఇవ్వాలని, ఆరోగ్య బీమా రూ. 20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో బాలకిషన్‌కు అందజేశారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కే. రాజేశ్వర్, కోశాధికారి అరవింద్, గంగాధర్, భూమయ్య , కార్మికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సరికావు


మాట్లాడుతున్న సఖీ కేంద్రం టీం సభ్యులు కవిత

మాక్లూర్: బాల్య వివాహాలు సరికావని నిజామాబాద్ సఖీ కేంద్రం టీం సభ్యులు కవిత అన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన, దగ్గరుండి చేసిన సొంత తల్లితండ్రులైన సరే ... వారిపై చట్ట రీత్యా చర్యలు చేపట్టవచ్చని చెప్పారు. శుక్రవారం మండలంలోని దాస్‌నగర్ వద్దగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సుకు ఆమెముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించారు. అలాగే గృహ హింస, పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం 24 గంటలు పని చేస్తుందని చెప్పారు. అత్యవసర పరిస్థితిలో మహిళలు 181 నంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు. సఖీ కేంద్రం సభ్యులు సౌమ్య, భానుప్రియ, సంగీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడలలో గెలుపు ఓటములు సహజం


వేల్పూర్‌లో క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

వేల్పూర్: క్రీడలలో గెలుపు ఓటములు సహజమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. వేల్పూర్ హైస్కూలు అధిక బహుమతులు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో జూనియర్, సబ్‌జూనియర్ విభాగాలలో గెలుపొందిన బాలురు, బాలికల జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రేణుక, క్రీడల కన్వీనర్ రాజన్న, ఎంపీడీవో బాలకిషన్, వేల్పూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆలూర్ గంగారెడ్డికి ఘన నివాళులు


ఆలూర్ గంగారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కూతురు విజయభారతి, నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం గ్రామానికి చెందిన నాయకుడు ఆలూర్ గంగారెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామస్తులు ఘన నివాళులర్పించారు. ఆలూర్ గంగా రెడ్డి కూతురు బీఆర్‌ఎస్ నాయకురాలు విజయ భారతి కార్యక్రమానికి హాజరై తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానంలో తండ్రి ఆలూర్ గంగా రెడ్డి సేవలను గుర్తు చేశారు. అలాగే తండ్రి స్మారకార్థం స్థానిక పాఠశాలలో కళా వేదికను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో మేస నరేందర్, పీఆర్టీయూ నాయకులు అశ్ఫాక్ అహ్మద్, పీడీ గటడి రాజేష్, నాయకులు కల్లెం మోహన్ రెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందూర్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు


బోధన్‌లోని ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

బోధన్‌టౌన్ : పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో బతుకమ్మ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలతో బతుకమ్మలు పేర్చి చిన్నారులు పాటలు పాడుతూ ఆడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ట్రస్మా డివిజన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోడాలి కిశోర్‌కుమార్ హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ పాఠశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు.హెచ్‌ఎం సుధారాణి, ట్రస్మా పట్టణ అధ్యక్షులు హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


అమ్మవారి వేషధారణలో చిన్నారులు

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్


ఓటు వేయడానికి క్యూలో ఉన్న విద్యార్థినులు

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓట్లను ఉపాధ్యాయుల లెక్కించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఓట్లను లెక్కిస్తున్న ఉపాధ్యాయులు

నాణ్యమైన విత్తనంతో సాగు లాభదాయకం


మందర్నా గ్రామ శివారులో సోయా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బోధన్: నాణ్యమైన విత్తన వినియోగంతోనే పంట దిగుబడి లాభదాయకంగా ఉంటుందని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. క్వాలిటీ సీడ్ విలేజ్ ప్రోగాంలో భాగంగా శుక్రవారం సాలూర మండలంలోని మందర్నా, ఫత్తేపూర్ గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించి పంటలను పరిశీలించారు. పంటల పెరుగుదల, చీడపీడల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అధిక దిగుబడుల సాధన అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు రమ్యా రాథోడ్, రమేష్, రీసెర్చ్ అసోసియేట్ చంద్రకళ, ఏవో శ్వేత, ఏఈవోలు సుజాత, అపర్ణ రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

రుద్రూర్: కోటగిరి మండలం అడ్కస్‌పల్లి, పోతంగల్ మండల శివారులో శుక్రవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పిర్దోజ్ సహన పర్యటించారు. రైతులు సేద్యం చేస్తున్న నూతన వరి రకం (ఆర్‌డీఆర్– 1200) పంటను పరిశీలించారు. పంటకు సంబంధించిన తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు అందజేశారు. యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో నూతన వరి రకం విత్తడానికి రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోటగిరి, పోతంగల్ మండలాలవ్యవసాయాధికారులు టి. రాజు, బి.నిశిత, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

పనుల్లో జాప్యం చేయొద్దు


కోటగిరి తహసీల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్: రెవెన్యూ పనుల్లో జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని బోధన సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. కోటగిరి మండల తహసీల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. 22–ఎ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి తప్పులు లేకుండా అప్‌డేట్ చేయాలని సూచించారు. సాదాబైనామ కేసుల వివరాలు తెలుసుకున్నారు. మండల తహసీల్దార్ గంగాధర్ ఉన్నారు.

నిరుపేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని వినతి

బోధన్: పట్టణ కేంద్రంలో ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా రేకుల షెడ్డులు, గుడిసెలు నిర్మించుకుని నివాసం ఉంటున్న నిరుపేదలకు గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 58,59 ప్రకారం పట్టాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో అధికారికి బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వం పేదల సొంత స్థలం కల నెరవేర్చేందుకు జీవోలు తీసుకొచ్చిందన్నారు. నాయకులు పెరక రామకృష్ణ, రవిశంకర్‌గౌడ్, షేక్ మహ్మద్, కొండం సాయిలు పాల్గొన్నారు.

డబ్బుల గోల్‌మాల్‌పై సంఘ సభ్యుల ఆందోళన


మెండోరాలో సమావేశమైన మహిళలు

బాల్కొండ: మెండోరాలోని ఎస్సీ సంఘ భవనంలో శుక్రవారం స్థానిక భారతి మహిళ సమాఖ్య సభ్యులు సమావేశమై మహిళ సంఘం డబ్బుల గోల్‌మాల్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్ల క్రితం గ్రామంలోని మహిళ సమాఖ్యల నుంచి విలేజ్ లెవల్ ఎంట్రప్రెన్యూర్ (వీఎల్‌ఈ), మహిళ సమాఖ్య వీవోఏ కలిసి డబ్బులు వసూలు చేసి రుణాలు చెల్లించలేదు.సుమారుగా రూ.30 లక్షలు దుర్వినియోగం చేసినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. మహిళ సమాఖ్య సంఘానికి డబ్బులు చెల్లిస్తామని వాయిదాలు పెడుతూ.. ఇప్పటి వరకు చెల్లించ లేదు. సుమారుగా రూ. 2.08 లక్షలు చెల్లించాలని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సంఘం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీ కమీషన్ల రద్దు హర్షనీయం


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్ : రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేయడం ద్వారా ఆర్‌ఎంపీలకు వచ్చే కమీషన్లు రద్దు చేస్తూ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాఖ అధికారులు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వీ.ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో గత 20 ఏళ్లుగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు చేస్తున్న కమీషన్ల దందాకు చెక్ పెట్టాలని, దందా ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని అనేక దఫాలుగా ఉద్యమాలు నిర్వహించామన్నారు.సమావేశంలో మాస్‌లైన్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బీ.దేవరాం , జిల్లా నాయకులు ఎం.ముత్తెన్న, ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి బీ.కిషన్, నాయకులు శేఖర్, రాజన్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, నజీర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ వైద్య శిబిరం


సాలూర పీహెచ్‌సీలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న వైద్యుల బృందం, సిబ్బంది


కల్లెడి పీహెచ్‌సీలో..

బోధన్: స్వస్థ నారీ–సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి వైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన మహిళలకు వైద్య పరీక్షలు, చికిత్సలు నిర్వహించి మందులు అందించారు. బోధన్ జిల్లా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వాణి, రమేష్, ప్రవీణ్ వైద్య పరీక్షలు చేశారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

మాక్లూర్: మండలంలో కల్లెడి పీహెచ్‌సీలో స్వస్థ నారీ–సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో 164 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనిక్, చర్మ ,పిల్లలకు సంబంధ సమస్యలపై అవగాహన కల్పించి సలహాలు, సూచనలు చేశారు. మందులు పంపిణీ చేశారు. స్త్రీ వైద్య నిపుణులు ఆశా జ్యోతి, చర్మ వైద్యులు అవాంతి , పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అర్చన, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రవీణ్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ పద్మ, ఫార్మసీ ఆఫీసర్ నారాయణ, సూపర్ వైజర్లు ప్రభాకర్, సుమతీ, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆశాలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జోరందుకున్న మక్క కోతలు



బాల్కొండ: గత పక్షం రోజులుగా కురిసిన వర్షాలు తెరిపి ఇవ్వడంతో శుక్రవారం నుంచి మక్కజొన్న కోతలు జోరందుకున్నాయి. రైతులు మహారాష్ట్ర కూలీలకు గుత్తాగా కోతకు ఇస్తున్నారు, ఎకరానికి రూ. 4 వేలు తీసుకుంటున్నారు. మక్క పంటను కోత కోసి కంకులు విరిచి కుప్పగా వేస్తారు. అనంతరం కుప్పను యంత్రాలతో నూర్పిడీ చేసి మక్కలను రోడ్డు, కల్లాల్లో ఆరబెట్టి విక్రయిస్తారు. ప్రస్తుతం మక్క పంటకు క్వింటాల్‌కు రూ.2300 పలుకుతుంది. వరుణుడి కరుణ చూపితేనే పంటలకు గట్టెక్కుతాయని రైతులుచెబుతున్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



బోధన్: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న విశిష్ట సేవలు అభినందనీయమని బోధన్ ఎంఈవో నాగయ్య కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో మండల స్థాయిలో ఎంపిక చేసిన 20 మంది వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా విచ్చేసిన ఎంపీడీవో మధుకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజానికి మార్గదర్శకమన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వీడీసీ ఆగడాలను అరికట్టాలి

బోధన్‌టౌన్(బోధన్): ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో వీడీసీ ఆగడాలను అధికారులు అరికట్టాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గంగాధర్ గౌడ్ డిమాండ్ చేశారు. తాళ్ల రాంపూర్‌లో గౌడ కులస్తులపై వీడీసీలు చేసిన భౌతిక దాడులను నిరసిస్తు చలో రాంపూర్‌లో భాగంగా తరలి వెళ్తున్న గౌడ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గౌడ నాయకులు రవిశంకర్ గౌడ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెర్కిట్(ఆర్మూర్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస ప్రజలకు సూచించారు. గోవింద్‌పేట్ పీహెచ్‌సీ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున ఇంటి పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షపు నీటిలో దోమల లార్వా వృద్ధి చెంది డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేర్ రాణి, గణేష్, జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మి నర్సింహ ఇన్‌ఫ్రా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ అగ్నిమాపక శాఖ అధికారులకు బీఆర్‌ఎస్ నాయకులు పూజ నరేందర్ ఫిర్యాదు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అగ్నిమాపక శాఖ అధికారులకు శుక్రవారం కలిసి సమస్యను వివరించారు. సెట్ బ్యాక్, అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికులకు వేతన బకాయిలు ఇప్పించాలి

సుభాష్‌నగర్: జీపీ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే ఇప్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.